క్లుప్తంగా

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

ఆర్డీఓ అద్దెయ్య

గురజాల : రెవెన్యూ పరంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె.అద్దెయ్య సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న మీ సేవా, స్పందన అర్జీలు, రీ సర్వే దరఖాస్తులు, పలు రకాల ధ్రువీకరణ పత్రాల అర్జీలు వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

పీఆర్కే పరామర్శ



కారెంపూడి: టీడీపీ నాయకుల దాడిలో గాయపడి నరసరావుపేటలో చికిత్స పొందుతున్న ఒప్పిచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీకాంత్‌ను ప్రభుత్వ విప్, జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. నరసరావుపేట జీబీఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌ను ఆ గ్రామ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. శ్రీకాంత్ ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పీఆర్కే వెంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, షేక్ మౌలాలి, నరేంద్ర, కరీం తదితరులు ఉన్నారు.

రీసర్వేపై శిక్షణ

గురజాల : భూ రక్ష రీ సర్వేపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్ వసంత బాబు చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం సమావేశ హాలులో బుధవారం రీ సర్వేపై ఒక్కరోజు శిక్షణ తరగతి నిర్వహించారు. వసంతబాబు మాట్లాడుతూ రీ సర్వే విధి విధానాలను అధికారులకు వివరించారు. రీసర్వే జరుగుతున్న సమయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వెల్లడించారు.

రేషన్ పంపిణీ

మాచర్ల: పట్టణం, మండలంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ రేషన్ పంపిణీని తహసీల్దార్ రమేష్‌కుమార్, పౌర సరఫరాల డెప్యూటీ తహసీల్దార్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలోని రేషన్ డీలర్లు తమకు కేటాయించిన ఎండీఎం వాహనాలకు సరుకును అప్పగించి రేషన్ బియ్యం, కందిపప్పు, పంచదారను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమాన్ని సీఎస్ డీటీ మురళి పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

శరవేగంగా మంచినీటి పైప్‌లైన్ పనులు



పిడుగురాళ్ల: గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కృష్ణా నది నుంచి ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా మంచినీటిని అందించేలా ఎమ్మెల్యే పనిచేస్తున్నారు. పట్టణంలో సుమారు 15 వేల గృహాలు ఉండగా ఇప్పటికే సుమారుగా 5,400 ఇళ్లకు పైపులైన్ ద్వారా తాగునీటిని అందించారు. మరి కొన్ని వార్డుల్లో పైపులైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ప్రీతి మృతి బాధాకరం



మాచర్ల: ర్యాగింగ్ భూతానికి గిరిజన బిడ్డ ధరవత్ ప్రీతి బలికావడం బాధాకరమని మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, గిరిజన సంఘం జిల్లా నాయకులు కరంటోత్ పాండు నాయక్, ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ ప్రెసిడెంట్ రామేశ్వర నాయక్ పేర్కొన్నారు. ప్రీతి మృతికి సంతాపం తెలుపుతూ బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన బిడ్డను బలి తీసుకున్న వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దశరథ్‌నాయక్, గాంధీ నాయక్, మూడావత్ బాలాజీ, నాగేశ్వరరావు నాయక్, హనుమానాయక్, మాద్యానాయక్ పాల్గొన్నారు.

పేద వృద్ధుడికి దహన సంస్కారాలు

తెనాలిఅర్బన్: అనాథ వృద్ధుడికి శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు బుధవారం దహన సంస్కారాలు చేసి పలువురి ప్రసంశలు పొందారు. చినరావూరులో రావి సాంబశివరావు(67) మృతి చెందాడు. దహన సంస్కారాలు చేసే ఆర్థిక స్తోమత కుటుంబ సభ్యులకు లేకపోవటం వల్ల వారు శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి కన్వీనర్ కుర్రా శ్రీనును సంప్రదించారు. దీంతో సమితి వారు సాంబశివరావు దహన సంస్కారాలు జరిపించారు.

సృజనకు పదును

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

గురజాల : గురజాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమలోని సృజనాత్మకతకు పదును పెట్టారు. వైజ్ఞానిక ప్రదర్శనతో అందరినీ అబ్బురపరిచారు. సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆహూతులను ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలో ఉంచిన పలు నమూనాలు విద్యార్థుల ప్రతిభకు అద్దంపట్టాయి. ముఖ్యంగా తొమ్మిదో తరగతి విద్యార్థి చరణ్ రూపొందించిన భూకంపాలను ముందుగానే పసిగట్టే అలారం నమూనా అందరినీ అబ్బురపరిచింది.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

వెల్దుర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పద్మ చెప్పారు. బుధవారం మండలంలోని శిరిగిరిపాడు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం.సుజాత, బి.శైలజ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ పోతురాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

‘హృదయం’ హత్తుకునేలా



గురజాల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాయి, జగదీశ్వర్ హృదయం పనిచేసే విధానంపై ప్రదర్శించిన నమూనా గుండెలను హత్తుకుంది. హృదయానికి రక్తం ఎలా సరఫరా అవుతుంది? ఎలా పనిచేస్తుంది? మంచి రక్తం, చెడు రక్తం ప్రసరించే వైనం తదితర అంశాలను వివరిస్తూ విద్యార్థులు దీనిని తయారు చేశారు.

స్వేదనపై అవగాహన



పదో తరగతి చదువుతున్న నరేంద్ర, మణికుమార్ స్వేదన ప్రక్రియ విధానంపై ప్రదర్శించిన నమూనా అవగాహన కల్పించింది. వివిధ భాష్పీభవన స్థానాలు కలిగిన ద్రవాలను వేరుపరచడానికి స్వేదన ప్రక్రియ ఉపయోగ పడుతుందని విద్యార్థులు వివరించారు.

జీర్ణం.. వాతాపి జీర్ణం



7వ తరగతి చదువుతున్న సమీహా, తేజశ్రీ జీర్ణ వ్యవస్థపై రూపొందించిన నమూనా ఆలోచింపజేసింది. మనం తీసుకున్న ఆహారం ఎలా జీర్ణమవుతుంది. జీర్ణ వ్యవస్థ చేసే పనులు, లాభాల గురించి విద్యార్థులు వివరించారు.

సంక్షేమం వల్లే జన నీరాజనం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి గడపలో ప్రజలు నీరాజనం పలుకుతున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చెప్పారు. నగర పంచాయతీ 1వ సచివాలయం పరిధిలోని 8వ వార్డులో బుధవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలోనే ఆదర్శ సీఎంగా ఆయన నిలిచారన్నారు. కుల, మత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎంను రానున్న ఎన్నికల్లోనూ దీవించాలని కోరారు. చంద్రబాబునాయుడు ఎప్పుడూ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడమే కానీ వాటిని నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని 90 శాతం హామీలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని గమనించారా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ పాలన బాగుందని, అన్నీ అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. పలువురు వీధిలైట్ల గురించి విన్నవించగా వెంటనే పరిష్కారం చూపాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మన్నెం ప్రసాద్‌రావు, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కె.ప్రగతి కోటేశ్వరరావు, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాగులు మీరా, వలి, కొమ్మినేని రవిశంకర్, కౌన్సిలర్లు కుక్కమూడి అనిల్ కుమార్, అంజి, గోళ్ల సైదయ్య, కోఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, కందిమళ్ల శ్రీను,పి కోటిరెడ్డి, శివారెడ్డి, కె.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల



శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర మూలవిరాట్

దుర్గి: ముటుకూరు గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. కొన్నేళ్లుగా గ్రామస్తులు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 17 భారీ విద్యుత్ ప్రభలు నిర్మించారు. ఉదయం వేకువజాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యంతో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. మహా అన్నదానం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు పులిహోర, మజ్జిగ, మంచినీరు అందజేశాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్థానిక పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రభలను సందర్శించి అభినందనలు తెలిపారు. డీఎస్పీ జయరాం ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

టైలర్లకు సత్కారం



మాచర్ల: పట్టణంలో ప్రతిభావంతులైన టైలర్లను సత్కరించడం అభినందనీయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు చెప్పారు. పట్టణ లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక టైలర్లు ఆర్.గఫూర్, బొట్ల సుజాతను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్యక్షులు విడేల శ్రీనివాసరావు, సభ్యులు ఓరుగంటి చెన్నకేశవరావు, పాస్ట్ గవర్నర్ అడ్వైజర్ చుండూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో గణపవరం విద్యార్థుల సత్తా



విజేతలైన విద్యార్థులతో గ్రాండ్‌మాస్టర్ కమాల్ బాష, ట్రైనర్లు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ స్కూల్ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూలో శిక్షణపొందుతున్న విద్యార్థులు చాంపియన్‌షిప్ పోటీల్లో ఘన విజయం సాధించారు. గత నెల 26వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో వైఎంకే ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పలు విభాగాల్లో బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. కట, స్పారింగ్ విభాగాల్లో ఐ.షణ్ముఖి, వి.అచ్చయ్యలు బంగారు పతకాలు, ఎస్.జశ్వత్‌రెడ్డి, అమూల్య, షేక్ నసీమ, జె.కుశాల్ సాయి, జి.లోకేష్‌లు వెండి పతకాలు సాధించారు. చైతన్యరెడ్డి, ఎస్.లౌక్యశ్రీ, ఎ.షణ్ముఖప్రియ, షేక్ హుస్సేన్, కె.ప్రశాంత్‌రాజ్ రజత పతకాలను సాధించారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ ఎస్ఎం కమాల్‌బాష మాట్లాడుతూ, విద్యార్థులు కృషి, పట్టుదలతో తర్ఫీదు పొంది పతకాలు సాధించారన్నారు. ఆరేళ్ల షణ్ముఖి, ఏడేళ్ల అచ్చయ్యలు బంగారు పతకాలు సాధించటం అభినందనీయమన్నారు. వీరికి శిక్షణనిస్తున్న మాస్టర్స్‌ను అభినందించారు.

అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సర్వీసులు

వినుకొండ(నూజెండ్ల): ఈనెల 7న మహాపౌర్ణమి మంగళవారం సందర్భంగా అరుణాచలం స్వామి దర్శనం, గిరిప్రదక్షిణం చేసుకునేందుకు వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావు నాయక్ బుధవారం తెలిపారు. వివరాల కోసం 7382896046, 7382898227 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి సాగుచేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురికారని, పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులు అందించే దిశగా కృషిచేయాలని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది తమ పొలాల్లో 21రకాల విత్తనాలను బీజామృతం విత్తనశుద్ధి చేసి పొలంలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంటీలు జగదీష్, ఓంకార్, మనోజ్, నందకుమార్, సైదయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన జేకే ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య ప్రత్యేకంగా పూజలు చేసి ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ ఫిల్లింగ్ స్టేషన్ స్థాపించిన జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్యను అభినందించారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి, సర్పంచ్ జంగా సురేష్, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మాశెట్టి పుల్లారావు, సాగర్ సిమెంట్స్ జీఎం బిక్షారెడ్డి, ఇన్‌పుట్ రిసోర్స్ కంపెనీ ఎండీ ఎస్.వి. రామచంద్రరావు, ప్రభాకర్‌రావు, డీలర్స్, లారీ ఓనర్సు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మార్కెట్‌యార్డు పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డును మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. మార్కెట్ కమిటీ పాలక మండలి తొలి సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మాట్లాడారు. యార్డు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 18 మంది కమీషన్ ఏజెంట్లకు ప్లాట్ కేటాయింపు పత్రాలను అందజేశారు. మిర్చి రైతులు గుంటూరు వెళ్లాల్సిన అవసరం లేకుండా నడికుడి యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పంటను విక్రయించాలని సూచించారు. గుంటూరు నుంచి మిర్చి ఎగుమతిదారులు, కమీషన్ ఏజెంట్లు నడికుడి యార్డుకే వస్తున్నారని వివరించారు. మిర్చి క్రయ విక్రయాలకు అవసరమైన వసతులు కల్పించాలని యార్డు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కలకండ ఆంధ్రయ్య, వైస్ చైర్మన్ తగుళ్ల పెదపిచ్చయ్య, యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు వెంగయ్య, సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మహేష్‌రెడ్డి అక్రమాలను ప్రోత్సహించడు’

దాచేపల్లి : ‘‘ఇటు సూర్యుడు అటు పొడిచినా మహేష్‌రెడ్డి అక్రమ వ్యాపారాలు చేయడు.. ప్రోత్సహించడు, ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలి’’ అని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓ దినపత్రికలో అడవి భూమిలో మైనింగ్ జరుగుతున్నట్లు వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. దీనిపై తక్షణమే విచారణ చేయాలని మైనింగ్ అధికారులను కోరామని, అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఏదో జరిగిపోయినట్లు మనకొక ఆయుధం దొరికిందని టీడీపీ నాయకులు సంబరపడిపోతున్నారని, మహేష్ రెడ్డి తప్పు చేయడు.. భయపడడని ఎమ్మెల్యే వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 వరకు దాచేపల్లిలో 30వేల టన్నులు, కొనంకిలో మరో 30వేల టన్నుల ఖనిజ సంపదను దోచుకున్నారని విమర్శించారు. అప్పట్లో నడికుడిలో ముగ్గురికి, కొనంకిలో ఇద్దరికి మాత్రమే మైనింగ్ లీజులు ఉన్నాయని, 60వేల టన్నుల ఖనిజ సంపదను తీస్తే ప్రభుత్వానికి కేవలం రూ.73 లక్షలు మాత్రమే రాయల్టీ కట్టారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 45 మందికి మైనింగ్ లీజులు ఇప్పించామని, అక్రమ మైనింగ్ చేయించాలనే ఆలోచన ఉంటే అంతమందికి అనుమతులు ఎలా ఇప్పిస్తామని కాసు ప్రశ్నించారు. మైనింగ్ యజమానుల నుంచి ప్రభుత్వానికి రూ.5.60 కోట్ల రాయల్టీ కట్టించామని స్పష్టం చేశారు. అక్రమాలపై ఆధారాలుంటే మైనింగ్ శాఖకు అందజేయాలని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కలకండ ఆంధ్రయ్య, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎద్దుల బండ లాగుడు పోటీలు



ఎద్దుల బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న యెనుముల మురళీధర్‌రెడ్డి

గురజాల: నగర పంచాయతీ జంగమహేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామ రైతు సంఘం, యెనుముల మురళీధర్‌రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎద్దుల బండ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం జాక్‌పాట్ పోటీలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. జత పళ్ల భాగంలో మొత్తం 9 జతలు పాల్గొన్నాయి. వాటిలో చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి, మార్టూరు గ్రామానికి చెందిన గొతుకట్ల వెంకట కిష్టయ్య యాదవ్‌ల ఎడ్ల జత 4,000 అడుగులు లాగి ప్రథమ బహుమతిని, కృష్ణా జిల్లా గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ దేవ తాతారావు ఎడ్ల జత 3,779.3 అడుగులు లాగి ద్వితీయ బహుమతిని, ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామానికి చెందిన కల్లూరి ప్రవీణ్‌కుమార్ ఎడ్ల జత 3,750 అడుగులు లాగి తృతీయ బహుమతిని కై వసం చేసుకున్నాయి. ఎడ్ల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు.

శ్రీనగర్‌లో విషాదఛాయలు

దైవదర్శనానికి వెళ్తూ కాణిపాకం వద్ద వైఎస్సార్ సీపీ నేత మృతి



మృతిచెందిన ఆళ్ల రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

దాచేపల్లి : దైవదర్శనానికి వెళ్లిన కుటుంబం రోడ్డు ప్రమాదం బారిన పడడంతో మండలంలోని శ్రీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాణిపాకం సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో శ్రీనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నేత ఆళ్ల రాజశేఖర్‌రెడ్డి మృత్యువాతపడ్డారు. ఈ ఘటనలో రాజశేఖర్‌రెడ్డి కుమారుడు జయసూర్యరెడ్డి, అదే గ్రామానికి చెందిన బొంతు మల్లారెడ్డి, అతని భార్య మల్లేశ్వరి, అతని తల్లి తిరుపతమ్మ కూడా తీవ్రంగా గాయపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి భార్య సంధ్య స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి కుటుంబ సభ్యులు స్కార్పియో వాహనంలో తిరుపతి సమీపంలోని కాణిపాకం ఆలయానికి వెళ్లారు. కాణిపాకం సమీపంలో స్కార్పియో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడి తిరుపతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారు అక్కడే చికిత్స పొందుతున్నారు.

ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే కాసు

కాణిపాకం వద్ద జరిగిన ఘటనపై ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరా తీశారు. నడికుడి మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి జరిగిన ఘటనను ఎమ్మెల్యే కాసు దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజయ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే కాసు సూచించారు. ఈ ఘటనలో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ నేత ఆళ్ల రాజశేఖర్‌రెడ్డి మృతిపట్ల ఎమ్మెల్యే కాసు సంతాపం వ్యక్తం చేశారు.

● పింఛన్ల పంపిణీ



వైఎస్సార్ పెన్షన్ కానుక బుధవారం వేకువజామునే లబ్ధిదారుల తలుపు తట్టింది. ముంగిళ్లలో సంతోషాల సిరులు కురిపించింది. మాచర్ల పట్టణంలోని వలంటీర్లు తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించారు. పట్టణంలో 5వేల మందికి కమిషనర్ ఈవీ రమణబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. 19వ వార్డులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బత్తిన వేణు ఆధ్వర్యంలో ఆ వార్డు నేతలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పుల్లారెడ్డి, మురళి, గృహసారథులు శివారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు ఆకుల శ్రీనివాసనాయుడు, ఉమ్మడి వాసు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. మాచర్ల